క్లుప్తంగా

అదనపు తరగతి గదులకు ఎమ్మెల్సీ హామీ



ఎమ్మెల్సీ నర్సిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న అధ్యాపకులు

వైరా: వైరాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సౌకర్యార్థం అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.10 లక్షలు నియోజకవర్గ అభివృద్ధి నిధులను కేటాయించనున్నట్లు ఖమ్మం, నల్గొండ, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎమ్.సత్యనారాయణ, అధ్యాపకులు బి.వీరభద్రరావు, బాబురావు, శ్రీకాంత్, మధు, సర్వేశ్వరరావు, ఎంఈ శ్రీనివాసరావులు ఎమ్మెల్సీ నర్సిరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆర్థికాభివృద్ధికి 'దళిత బంధు'

ఖమ్మం సహకారనగర్: దళితుల ఆర్థికాభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం దళితబంధు పథకాన్ని అమలుచేస్తోందని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. ఈ పథకం కింద చింతకాని మండలం కొదుమూరుకు చెందిన తడికమల్ల నరేష్‌కు ఎల్ఈడీ యూనిట్ అందజేశారు. ఈమేరకు యూనిట్‌ను కలెక్టర్ సోమవారం పరిశీలించి మాట్లాడుతూ.. దళితబంధు లబ్ధిదారులను అందరూ ప్రోత్సహించాలని సూచించారు.

ఏప్రిల్ 14నుంచి ఇంటింటికీ సీపీఐ



మాట్లాడుతున్న భాగం హేమంతరావు

బోనకల్: ఏప్రిల్ 14నుంచి 22 వరకు సీపీఐ ఆధ్వర్యంలో ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆపార్టీ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు అన్నారు. మండలకేంద్రంలోని ఎస్ఆర్‌కే కాంప్లెక్స్‌లో జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు అధ్యక్షతన నియోజవర్గ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ స్ఫూర్తిని దెబ్బతీసేలా ప్రధాని మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యుడు జితేందర్‌రెడ్డి, గోవిందరావు, రవిబాబు, రవీంద్రబాబు, ఆనందరావు, మల్లిఖార్జున్ ఉన్నారు.

చిత్రకళపై విద్యార్థులకు అవగాహన

సత్తుపల్లిరూరల్: పాఠ్యాంశాల్లో పెయింటింగ్, డ్రాయింగ్ చేరిస్తే మంచి ఫలితాలు వస్తాయని 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ సహాయ దళాధిపతులు నాగేశ్వరరావు, నర్సింహారావు అన్నారు. స్థానిక విశ్వశాంతి విద్యాలయంలో చిత్రలేఖనంపై సోమవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు గీసిన చిత్రాలతో పాటు ప్రముఖ చిత్రకారులు బాలకృష్ణ, సాయిశ్రీ గీసిన పెయింటింగ్స్‌ను ప్రదర్శనలో ఉంచారు. విశ్వశాంతి ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాగేశ్వరరావు, నర్సింహారావు మాట్లాడగా, పాఠశాల యాజమాన్యం సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

సత్తుపల్లిటౌన్: జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ 3, 4 తేదీల్లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగే మహాధర్నా విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు అన్నారు. ఈ సందర్భంగా సోమవారం 'చలో ఢిల్లీ'పోస్టర్లను ఆవిష్కరించారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు సాధనకోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రసాదరావు, శ్రీనివాస్, రవి, రాము, సాంబశివరావు, వెంకట్, మధు, లక్ష్మీ, లలిత పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

వైరారూరల్: మండలంలోని నారపునేనిపల్లి గ్రామంలో ఇటీవల కోతుల దాడిలో తీవ్రంగా గాయపడిన రాచబంటి లక్ష్మయ్యకు సోమవారం తేదేపా మండల కమిటీ సభ్యులు పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. పాలకులు, అధికారులు గ్రామంలో భీభత్సం సృష్టిస్తున్న కోతులను పట్టించి అడవిలో వదిలిపెట్టాలని డిమాండ్ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు చెరుకూరి చలపతిరావు, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు సన్మానం

చింతకాని: మండలంలోని లచ్చగూడెం గ్రామ సర్పంచ్ గురిజాల జాన్సీని గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు సోమవారం శాలువాతో సన్మానించారు. నేషనల్ గ్రామ పంచాయతీ అవార్డ్స్‌కు ఎంపిక కావడంతో ఆమెను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తిరుపతి కిషోర్, వైస్ ఎంపీపీ హనుమంతురావు, సొసైటీ డైరెక్టర్ ప్రసాద్, ఉపసర్పంచ్ సైదేశ్వరరావు, ఎంపీఓ రవీంద్ర ప్రసాద్, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీరామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మిగిలింది నాలుగురోజులే..

- ఆస్తిపన్ను లక్ష్యం కోసం మున్సిపాలిటీలు కసరత్తు
- మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి
- పన్ను వసూళ్లలో జిల్లాలో సత్తుపల్లి ముందంజ



పన్నులు వసూలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది



సత్తుపల్లి మున్సిపాలిటీ కార్యాలయం

మున్సిపాలిటీ	ఇళ్లు/దుకాణాలు	మొత్తం పన్ను డిమాండ్	వసూలు
సత్తుపల్లి	9146	రూ.4.49 కోట్లు	రూ.3.60 కోట్లు
వైరా	6588	రూ.1.86 కోట్లు	రూ.1.13 కోట్లు
మధిర	8203	రూ.2.55 కోట్లు	రూ.1.78 కోట్లు

సత్తుపల్లిటౌన్: ఈ ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగియనుంది. దీంతో జిల్లాలోని సత్తుపల్లి, మధిర, వైరా మున్సిపాలిటీల యంత్రాంగం ఆస్తి పన్ను వసూళ్లలో నిమగ్నమైంది. ఈ నాలుగురోజుల్లో ముమ్మరంగా పన్నుల వసూళ్లు చేపట్టేందుకు స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నారు. మున్సిపాల్టీల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధులతో పాటు ఆయా మున్సిపాల్టీల్లో ప్రజలు చెల్లించే ఆస్తి పన్నులే అత్యంత కీలకం. ఆర్థిక సంవత్సరానికి గడువు సమీపిస్తుండటంతో సాధ్యమైనంత వరకు వసూళ్లు చేసేందుకు మున్సిపల్ యంత్రాంగం ప్రయత్నాలు చేస్తోంది. ఇందు కోసం పన్ను బకాయిదారులకు ఫోన్లు చేసి పన్నులు సకాలంలో చెల్లించాలని తెలియచేస్తూనే ఇంటింటికీ తిరుగుతూ పన్నులు వసూళ్లు చేస్తున్నారు. జిల్లాలోని సత్తుపల్లి మున్సిపాలిటీ పన్నుల వసూళ్లలో ఇప్పటికే ముందంజలో నిలిచింది. పన్నుల వసూళ్లలో ఇప్పటి వరకు సత్తుపల్లి మున్సిపాలిటీ 81 శాతం, వైరా మున్సిపాల్టీ 61శాతం, మధిర మున్సిపాల్టీ 69 శాతం వసూళ్లు చేశారు.

సెలవురోజుల్లోనూ..

పన్నుల లక్ష్యం కోసం మున్సిపల్ యంత్రాంగం తీవ్రంగా కుస్తీ పడుతోంది. బిల్‌కలెక్టర్లు, ఆర్ఐలు, మేనేజర్లతో కలిసి మున్సిపల్ కమిషనర్, చైర్మన్ ప్రజలకు పన్నుల చెల్లింపుపై వార్డులలో తిరుగుతూ అవగాహన కల్పిస్తున్నారు. పండుగ, సెలవు రోజుల్లోనూ పన్నుల వసూళ్లపై దృష్టి సారిస్తున్నారు. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి లక్ష్యం మేరకు పన్నులు వసూళ్లు చేసేందుకు అధికారులు పర్యవేక్షణ చేపట్టారు.

మొండి బకాయిలపై దృష్టి..

ఆస్తి పన్ను చెల్లించడానికి ముందుకురాని మొండి బకాయిదారుల ఇళ్లు, దుకాణాలకు తాళాలు వేయటం, నల్లాలు డమ్మీ చేయటం వంటి చర్యలు చేపడుతున్నారు. మొదటిగా మొండి బకాయిల జాబితా సిద్ధం చేసి వారికి ఇదివరకే నోటీసులు జారీ చేశారు. రూ.5 వేలకు మించి పన్ను బకాయిలు ఉన్నవారికి రెడ్ నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులు అందిన 15 రోజుల్లోగా పన్నులు చెల్లించాల్సి ఉంటుంది. లేనట్‌లైతే ఎటువంటి సమాచారం లేకుండానే ఆస్తులను జప్తు చేయటం జరుగుతుందని అధికారులు తెలిపారు. అదే విధంగా అద్దెకు ఉంటున్న వారికి టెనెంట్ నోటీసులు జారీ చేస్తూ సదరు యజమానికి సకాలంలో పన్ను చెల్లించాలని తెలియజేస్తున్నారు. అందరు పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధి పాటుపడాలని, మున్సిపల్ ట్రాక్టర్లు, ఆటోలకు మైక్‌లు పెట్టి పట్టణాలలో అధికారులు ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

ప్రత్యేక దృష్టి సారించాం..



ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటి వరకు 81 శాతం ఆస్తిపన్ను వసూళ్లు చేశాం. పన్నులు వసూళ్లు చేసేందుకు మున్సిపాలీటీలో ప్రత్యేక కార్యాచరణ అమలు చేశాం. స్పెషల్‌డ్రైవ్ నిర్వహించాం. మొండి బాకాయిలదారులకు రెడ్ నోటీసులు జారీ చేశాం. నల్లాలు డమ్మీచేసి మరీ పన్నులు రాబట్టాం.

– కె.సుజాత, మున్సిపల్ కమిషనర్, సత్తుపల్లి

అభివృద్ధికి సహకరించండి..



మున్సిపాల్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సకాలంలో పన్నులు చెల్లించి సహకరించాలి. నూరు శాతం పన్నుల వసూళ్ల లక్ష్యాలను సాధించేందుకు అందరు పన్నులు చెల్లించి అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలి. నూరుశాతం పన్నుల వసూలు లక్ష్యంగా పనిచేస్తున్నాం.

– కూసంపూడి మహేష్, మున్సిపల్ చైర్మన్, సత్తుపల్లి

బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాములు నాయక్

ఏన్కూరు: మండలంలోని ఠాగూర్ కాల్యాణ మండపంలో సోమవారం బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వైరా ఎమ్మెల్యే రాములు నాయక్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలతో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. తెలంగాణలో బడుగు, బలహీన వర్గాలు, నిరుపేదల సంక్షేమ కోసం తెలంగాణ సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. నిరుపేదలకు 'డబుల్'ఇళ్లు, ఆడపిల్లలకు షాదీముబారక్, కల్యాణలక్ష్మీ పథకం, వృద్ధులకు, వితంతువులకు పింఛన్లు, రైతుల కోసం రైతు బంధు పథకం, రైతుబీమా, ఉచిత విద్యుత్, సాగునీటి కోసం ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టి బీడుభూములు సాగులోకి తెచ్చారని తెలిపారు. దేశంలో కులమతాలను, ప్రజాస్వామ్యాన్ని బీజేపీ రెచ్చగొడుతుందన్నారు. నిత్యావసర ధరలన్నింటినీ పెంచి పేద ప్రజలపై భారం మోపుతున్నారని తెలిపారు. కార్యకర్తలు కలసికట్టుగా పనిచేసి బీఆర్ఎస్ విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధిర మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వర్లు, శెట్టిపల్లి వెంకటేశ్వరావు, భూక్యా లాలు, సురేష్ నాయక్, మేడ ధర్మారావు, సాయిలు నాగయ్య, చీరాల కృష్ణవేణి, భూక్యకాంతి, నాగమణి, శివ, వీరునాయక్, పొట్ల శ్రీను, కృష్ణార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో కంటి వెలుగు



చింతకాని: కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ తిరుపతి కిషోర్

వైరా: దృష్టి లోపాలను దూరం చేసి పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'కంటి వెలుగు'కార్యక్రమాన్ని చేపట్టిందని ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ అన్నారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు గండుగలపాడు ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కంటి వెలుగు శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పలువురికి వైద్య సేవలు అందించి అవసరమైన వారికి కళ్ల అద్దాలను అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, కౌన్సిలర్ కర్నాటి నందిని, కర్నాటి హనుమంతరావు, కట్టా కృష్ణార్జున్‌రావు, మద్దెల రవి, మోటపోతుల సురేష్, సూర్యదేవర శ్రీధర్, శివ, బుజ్జి, సత్యంబాబు తదితరులు ఉన్నారు.

'కంటి వెలుగు' ప్రారంభం..

చింతకాని: మండలంలోని నర్సింహాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు వైద్య శిబిరాన్ని సోమవారం జెడ్పీటీసీ సభ్యుడు పర్చగాని తిరుపతి కిషోర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో దొడ్డా ప్రవీణ, ఎంపీడీఓ శ్రీనివాసరావు, మండల వైద్యాధికారి వెంకటేశ్వర్లు, ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణారావు, గ్రామపెద్దలు, వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ భాస్కర్‌రావు

మధిర: క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మాటూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ భాస్కర్‌రావు తెలిపారు. కృష్ణాపురంలో ఉన్న తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాల విద్యార్థులకు సోమవారం క్షయ వ్యాధిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గిపోవడం, రాత్రి పూట చెమట పట్టడం, దగ్గుతో పాటు రక్తం పడటం, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు ఉంటే దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొని వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధి సోకిన వారికి ఉచితంగా మందులు అందించడమే కాకుండా రూ.500లు ఇవ్వడం జరుగుతుందన్నారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ షమీమ్, వైద్య సిబ్బంది శరత్ బాబు, సందీప్, శివ, ప్రదీప్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

సత్తుపల్లిటౌన్: పట్టణానికి చెందిన న్యాయవాది తేళ్లూరి ఆదియ్య(ఆడమ్స్) భార్యతో కలిసి పాతసెంటర్ వైపు నుంచి బస్టాండ్ వైపు వస్తుండగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కావటంతో ఆదియ్యను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో గాయపడిన ఆదియ్య, భార్యను ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పరామర్శించి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు.

నష్టపరిహారం అందిస్తాం..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

వేంసూరు: ఇటీవల కురిసిన వర్షాలతో దెబ్బతిన్న పంటల సర్వే పూర్తైన వెంటనే ఎకరాకు రూ.10 వేల చొప్పున పంట నష్ట పరిహారం అందిస్తామని ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అన్నారు. సోమవారం మండలంలోని మర్లపాడు పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి, కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం సహకరించకున్న రాష్ట్ర ప్రభుత్వమే రైతులకు పరిహారం అందిస్తుందన్నారు. వచ్చే నెలలో మంత్రి ఎర్రబల్లి దయకర్‌రావు మర్లపాడు కురుమగూడెం నుంచి అమ్మపాలెం వరకు నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనునట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మందపాటి వేణుగోపాల్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ సోమిరెడ్డి పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ఎయిర్‌టెల్ 5జీ సేవలు ప్రారంభం..

సత్తుపల్లి: పట్టణంలో సోమవారం ఎయిర్‌టెల్ 5జీ సేవలను ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటర్ పసుమర్తి శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, ఆత్మకమిటీ చైర్మన్ వనమా వాసు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మిట్టపల్లిలో పర్యటన..

తల్లాడ: మండలంలోని మిట్టపల్లి గ్రామంలో సోమవారం సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర పర్యటనలో భాగంగా పలు కుటుంబాలను పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన మోటమర్రి రమేష్, మంగతాయారులతో పాటు పసుపులేటి వెంకటేశ్వర్లును పరామర్శించి వారి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెంకటేశ్వర్లుకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో రైతు బందు మండల కన్వీనర్ దుగ్గిదేవర వెంకట్‌లాల్, నూతనకల్ సర్పంచ్ శ్రీనివాసరావు, శీలం కోటారెడ్డి, తూము వీరభద్రరావు, మురళి, శ్రీనివాసరావు, సుదర్శన్, లక్ష్మన్‌రావు పాల్గొన్నారు.

సొసైటీ చైర్మన్‌కు పరామర్శ..

కల్లూరు రూరల్: మండలంలోని తాళూరు వెంకటాపురానికి చెందిన సర్వనేని సూరమ్మ సోమవారం మృతి చెందారు. ఈ మేరకు ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ ఎమ్మెల్యే చంద్రావతి తదితరులు ఆమె మృతదేహం నివాళులర్పించి, కుటుంబ సభ్యులు పోచారం సొసైటీ చైర్మన్ సర్వనేని పెద్ద అంజయ్య, చిన్న అంజయ్యను పరామర్శించారు. జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, బీఆర్ఎస్ అధ్యక్షుడు పాలెపు రామారావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే..

ఖమ్మం సహకారనగర్: నాగార్జునసాగర్ కాల్వ ద్వారా పంట పొలాలకు వచ్చే నెల 15వ తేదీ వరకు నిరంతరాయంగా నీరు అందించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే వెంకటవీరయ్య కోరారు. ఈమేరకు జిల్లా కేంద్రంలో కలెక్టర్ గౌతమ్‌ను సోమవారం కలిసి విన్నవించారు. అలాగే, ఎన్నెస్పీ కింద చెరువులు, కుంటలు నింపేలా కార్యాచరణ రూపొందించాలని, గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే పనులకు సమీపంలోని చెరువుల నుంచి మట్టిని తరలించాలని కోరారు.

మండలంలో పొంగులేటి పర్యటన

ముదిగొండ: మండలంలోని మేడేపల్లి, గోకినేపల్లి, న్యూలక్ష్మీపురం, వనంవారికిష్టాపురం గ్రామాల్లో సోమవారం ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. ఆయా గ్రామాల్లో పలు బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, ఎంపీపీ సామినేని హరిప్రసాద్, నాయకులు జూలకంటి సంజీవరెడ్డి, వట్టికూటి సైదులుగౌడ్, వాకదాని కన్నయ్య, బత్తుల వెంకట్రావు,అనంతరెడ్డి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.


మృతుల కుటుంబాలకు పరామర్శ..

ఏన్కూరు: మండలంలో పలు గ్రామాల్లో మృతుల కుటుంబాలను మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వైరా నియోజకవర్గ అభ్యర్థి బానోత్ విజయభాయి సోమవారం పరామర్శించారు. మండలంలోని లచ్చగూడెం, శ్రీరామగిరి, ఆరికాయలపాడులలోని మృతుల కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో స్వర్ణ ప్రహ్లాదరావు, నాగేశ్వరావు, శివకుమార్, వెంకటేశ్వరావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం చేయండి

మధిర: మరణానంతర నేత్రదానంతో ఇరువురు కార్నియా అంధులకు కంటి చూపు కల్పించేందుకు అందరూ నేత్రదానానికి ముందుకు రావాలని రిటైర్డ్ వైస్ ఛాన్సలర్, నాక్ డైరెక్టర్ డాక్టర్ వాసిరెడ్డి శివలింగ ప్రసాద్ పిలుపునిచ్చారు. మహదేవపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆదర్శ ఉపాధ్యాయుడు పుతుంబాక నరసింహారావు ఈనెల 18న మృతి చెందారు. ఆయన కుమారుడు అప్పారావు, కుటుంబ సభ్యుల అంగీకారంతో తన తండ్రి నేత్రాలను దానం చేసి ఇరువురు అంధులకు చూపునిచ్చిన సందర్భంగా సోమవారం మహదేవపురం గ్రామంలో ఆయనకు ప్రశంసాపత్రాన్ని అందించారు. తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవరవు నాగేశ్వరరావు నేత్రదాన ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, రామ్మోహన్‌రావు, సుభాష్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


సీసీ రోడ్డుకు శంకుస్థాపన



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ కవిత

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు గ్రామంలో సోమవారం రూ.5 లక్షల ఈజీఎస్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డుకు సర్పంచ్ వేమిరెడ్డి అనురాధ, జెడ్పీటీసీ సభ్యురాలు శీలం కవిత, ఏఎంసీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణలు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి తమ వంతుగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లిఖార్జున్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ మధుసూధన్‌రెడ్డి, రైతుసమితి జిల్లా కమిటీ సభ్యురాలు సుజాత, బీఆర్ఎస్ మండల కమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



సత్తుపల్లి: కరపత్రాలను అందజేస్తున్న సంభాని

సత్తుపల్లి/కల్లూరు రూరల్: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ అన్నారు. సోమవారం హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా సత్తుపల్లి మండలంలోని పాకలగూడెం, సత్యనారాయణపురం గ్రామాల్లో ఇంటింటికి పాదయాత్ర చేస్తూ కాంగ్రెస్‌ను ఆదరించాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు, సాగు పెట్టుబడి ఎకరాకు రూ.15 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ మోసపూరిత హామీలతో అధికారాన్ని దక్కించుకొని ప్రజల సంక్షేమాన్ని తుంగలో తొక్కారన్నారు. రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడం బీజేపీ నియంతృత్వానికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు శివవేణు, కొత్రపాటి సాల్మన్‌రాజుతో పాటు గోళ్ల అప్పారావు, హలావత్ వెంకటేశ్వర్లు, మాధవరావు, సాయి, తోట రాజేష్, వెంకటేశ్వరరావు, హలావత్ నాగేశ్వరరావు, ముత్తా వెంకన్న పాల్గొన్నారు. అలాగే, కల్లూరు మండలం ముగ్గు వెంకటాపురం, పేరువంచ, కప్పలబంధ గ్రామాల్లో కూడా సంభాని యాత్ర చేపట్టి మాట్లాడారు. నాయకులు బైరెడ్డి మనోహర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, శ్రీనివాసరెడ్డి, కృష్ణారెడ్డి, రమేష్, లక్ష్మారెడ్డి, విశ్వనాథం, రాంబాబు, పండు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ గదులకు వేలం పాట పూర్తి



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

తల్లాడ: తల్లాడ గ్రామ పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్ గదులకు సోమవారం నిర్వహించిన వేలం పాట పూర్తైంది. స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ పొట్టేటి సంధ్యారాణి అధ్యక్షతన ఈ వేలం పాటను నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 14 రూములకు పాటలు నిర్వహించారు. ఒక్కో షాపుకు రూ.30 వేలు డిపాజిట్ కట్టించుకున్నారు. డిపాజిట్ మధ్యాహ్నం 1 గంటలోగా చెల్లించాలని నోటీస్ బోర్డులో అంటించారు. ఆ తరువాత వచ్చిన వారు పాటలో పాల్గొనడం కుదరదని ఈఓ ఉమ తెలిపారు. దీంతో కొద్దిసేపు చర్చ జరిగింది. వెంటనే ఎంపీడీఓ రవీంద్రరెడ్డి, ఎంపీఓ కొండపల్లి శ్రీదేవి కలగజేసుకొని మిగిలిన వారు కూడా పాల్గొనవచ్చు అనడంతో వేలం పాట కొనసాగింది. కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



సత్తుపల్లిలో గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న సిబ్బంది

పోషణ పక్వాడా వేడుకల్లో భాగంగా సోమవారం అన్ని మండలాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలింతలకు, గర్భిణులకు, కిషోర బాలికలకు చిరు ధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలు అంగన్‌వాడీల్లో ఆరు నెలల పిల్లలకు అన్నప్రాసన, మూడు సంవత్సరాల పిల్లలకు అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని కిషోర బాలికలకు ఎనిమియా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల్లోని బాలికలకు రాత పరీక్షలు నిర్వహించి గెలుపొందిన బాలికలకు బహుమతులను అందించారు.

– సాక్షి నెట్‌వర్క్



ఎర్రుపాలెం: బనిగండ్లపాడులో కిశోర బాలికలకు పరీక్షలు చేయిస్తున్న ఏసీడీపీఓ కృష్ణశ్రీ



కారేపల్లి: వెంకిట్యాతండాలో..



అటెన్షన్ ప్లీజ్

ఎదురుగా వస్తే ఆగాల్సిందే..



ఎదురుగా వాహనం వస్తే ఆగాల్సిందే లేకుంటే కాల్వలోకి అదుపు తప్పి దూసుకెళ్లాల్సిందేనని వాహనదారులు వాపోతున్నారు. ముదిగొండ మండలంలోని మేడేపల్లి ఎన్ఎస్పీ మంగాపురం మేజర్‌సాగర్ కాల్వపై వంతెన రైయిలింగ్ విరిగిపోయి ప్రమాదకరంగా ఉంది. నిత్యం స్కూల్ బస్సులు, వాహనాలు రద్దీగా తిరుగుతుంటాయి. సాగర్ నీరు ప్రవహిస్తున్న క్రమంలో ప్రతీ వాహనదారుడు ఇక్కడికి రాగానే భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు ఎలాంటి హెచ్చరిక బోర్డులు అమర్చకపోవడంతో రాత్రి వేళల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆరోపిస్తున్నారు. ఎన్ఎస్పీ అధికారులకు పలు మార్లు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేదని వాపోతున్నారు.

– ముదిగొండ

ప్రశ్నించాల్సిన అధికారి : ఎం.వెంకటేశ్వర్లు, జలవనరుల శాఖ ఈఈ, ఖమ్మం
సెల్ నంబర్ : 9705877963